# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-01-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1** **భారత్, ప్రవాస భారతీయుల మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి ప్రవాసీ భారతీయ దివస్ వారథిగా మారిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**

**2.** **తిరుపతి తొక్కిసలాట ఘటనలో గాయపడిన వారిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ మధ్యాహ్నం పరామర్శిస్తారు.**

**3.** **తొక్కిసలాట ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు 25లక్షల రూపాయల పరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.**

**4.** **రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్పీ సిసోడియా రాష్ట్రంలో పర్యటిస్తున్న కేంద్ర బృందంతో ఈ రోజు సమావేశమై కరవు పరిస్థితులను వివరించారు.**

**5.** **రాజధాని ప్రాంతంలో రైతులకు కౌలు, పింఛన్ల కోసం 2024-25లో నాలుగో విడత కింద నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదలచేసింది.**

=========================

భారత్, ప్రవాస భారతీయుల మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి ప్రవాసీ భారతీయ దివస్ వారథిగా మారిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఒడిశాలోని భువనేశ్వర్‌లో 18వ ప్రవాసీ భారతీయ దివస్ సమావేశాన్ని ప్రధానమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేంద్రమోదీ మాట్లాడుతూ, గత పదేళ్లలో తాను అనేక మంది ప్రపంచ నాయకులను కలిశానని, ప్రతి ఒక్కరూ ప్రవాసభారతీయులను ప్రశంసిస్తున్నారని తెలిపారు. దీనికి ప్రధాన కారణం ప్రపంచ సమాజాలలో భారతీయ ప్రవాసులు పొందుపరిచిన సామాజిక విలువలు అని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ( 30 సెకన్లు)

-------------------------

తిరుపతిలోని టోకెన్ కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాటలో గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రులను, మృతుల కుటుంబ సభ్యులను మంత్రులు వి. అనిత, ఆనం రామనారాయణ రెడ్డి, అనగాని సత్యప్రసాద్ లు ఈరోజు పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులను రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆదుకుంటామని మంత్రులు హామీ ఇచ్చారు. అనంతరం హోంశాఖ మంత్రి వి. అనిత మాట్లాడుతూ,

వాయిస్ ( 29 సెకన్లు)

మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ...

వాయిస్ ( 30 సెకన్లు)

ఈ ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారాన్ని ప్రకటించింది. ఒక్కో కుటుంబానికి 25లక్షల రూపాయల పరిహారం ఇవ్వనున్నట్లు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ మధ్యాహ్నం తిరుపతి పర్యటన చేపట్టి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించనున్నారు.

---------------------------

మరో వైపు .. తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి జె. శ్యామలరావు బాధితులను పరామర్శించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. తొక్కిసలాట ఘటన దురదృష్టకరమని చెప్పారు. ఘటనకు గల కారణాలపై విచారణ జరుగుతోందని, పూర్తి వివరాలు త్వరలోనే తెలుస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో ఎవరికీ ప్రాణాపాయం లేదని, ఇద్దరికి మాత్రమే తీవ్ర గాయాలయ్యాయని.. వారికి చికిత్స అందిస్తున్నట్లు వివరించారు.

---------------------------

తిరుమలలో వైకుంఠద్వార దర్శనానికి సంబంధించి తొలి మూడు రోజులకు టోకెన్ల జారీని పూర్తి చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం -టిటిడి తెలిపింది. వైకుంఠద్వార దర్శనం కోసం రోజుకు 40వేల టోకెన్ల చొప్పున జారీ చేశారు. వీటిని కలిగిన భక్తులను మాత్రమే 10, 11, 12 తేదీల్లో అనుమతించనున్నారు. 13 నుంచి 18వ తేదీ వరకు తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద వైకుంఠ ద్వార దర్శన టికెట్లను ఏరోజుకారోజు ఇవ్వనున్నామని టిటిడి వెల్లడించింది.

---------------------------

రాష్ట్రంలో కరవు పరిస్థితులపై అధ్యయనం చేయడానికి వచ్చిన కేంద్ర బృందంతో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా అమరావతిలో ఈరోజు సమావేశమయ్యారు. ఖరీఫ్-2024 కరవు పరిస్థితులపై కేంద్ర బృందానికి నివేదికను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్పీ సిసోడియా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కరవు నివారణ చర్యలను చేపట్టిందని చెప్పారు. అన్నమయ్య జిల్లాలో - 19, చిత్తూరు - 16, శ్రీ సత్య సాయి - 10, అనంతపురం-7 కర్నూలు జిల్లాలో - 2 మండలాలను కరవు మండలాలుగా గుర్తించినట్లు చెప్పారు. రైతులను ఆదుకోవడానికి సత్వరమే 151.77 కోట్ల రూపాయల సాయం అందజేయాలని కేంద్ర బృందాన్ని ఆర్పీ సిసోడియా కోరారు.

---------------------------

రాజధాని ప్రాంతంలో రైతులకు కౌలు, భూమి లేని వారికి పింఛన్ల కోసం 2024-25లో నాలుగో విడత

కింద నిధులు విడుదలయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వం 255 కోట్ల రూపాయలను వేర్వేరుగా విడుదల చేసింది. రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ–సీఆర్‌డీఏ కమిషనర్ ప్రతిపాదనలపై పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నగదును త్వరలోనే లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలలోకి జమ చేస్తామని తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి జన్ మన్ పథకం కింద గిరిజన ప్రాంతాలలో త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. పార్వతీపురంలోని కలెక్టర్ కార్యాలయంలో ప్రధాన మంత్రి జన్ మన్ ఇళ్ల నిర్మాణ పనులపై ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు ప్రధానమంత్రి జన్ మన్ పథకం కింద 2 వేల 697 ఇళ్ళు మంజూరు అయ్యాయని చెప్పారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సీతంపేట మండలాల్లో మార్చి 31లోపు ఇళ్ల నిర్మాణం పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

---------------------------

రాష్ట్రంలో 2025–26 సంవత్సర బడ్జెట్‌కు సంబంధించిన అంచనాలు సిద్ధం చేసి పంపాలని అన్ని ప్రభుత్వ శాఖలను ఆర్థికశాఖ ఆదేశించింది. ఫిబ్రవరి లేదా మార్చిలో బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టాల్సి ఉన్నందున ఈ నెలాఖరుకు కొత్త బడ్జెట్ ఎలా ఉండాలనే దానిపై ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్ ఈ మేరకు మార్గదర్శకాలు జారీ చేశారు. 2024–25 బడ్జెట్ సవరించిన అంచనాల మేరకు ప్రతిపాదనలు రూపొందించాలని తెలిపారు.

---------------------------

మహాకుంభ్ 2025కు సంబధించి ఆకాశవాణి, దూరదర్శన్ రూపొందించిన ప్రత్యేక గీతాన్ని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ నిన్న ఢిల్లీలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రసారభారతి చైర్మన్ నవనీత్ కుమార్ సెహగల్, ప్రసార భారతి ముఖ్య కార్యనిర్వహణాధికారి గౌరవ్ ద్వివేది, దూరదర్శన్ డైరెక్టర్ జనరల్ కంచన్ ప్రసాద్, ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ ప్రజ్ఞా పాలివాల్ గౌర్ తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు ప్రయాగ్ రాజ్‌లో మహాకుంభ్ 2025 జరగనుంది.

---------------------------

సంక్రాంతి పండుగ రద్దీ దృష్ట్యా ప్రకాశం జిల్లా ఆర్టీసీ ప్రాంత పరిధిలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఆర్టీసీ ప్రాంతీయ అధికారి బి.సుధాకర్‌బాబు తెలిపారు. ఒంగోలులో ఆయన మాట్లాడుతూ.. రేపటి నుంచి సాధారణ చార్జీలతో ప్రత్యేక బస్సులు నడుస్తాయని చెప్పారు. ప్రయాణికులు ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఆర్టీసీ లైవ్ ట్రాక్ యాప్ ద్వారా బస్సుల రాకపోకల సమాచారాన్ని ప్రయాణీకులు తెలుసుకోవచ్చని ఆయన వివరిస్తూ...

వాయిస్ ..34.. సెకన్లు

---------------------------

పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటకు చెందిన ఆదర్శ రైతు నెక్కంటి సుబ్బారావుకు  ఈనెల 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొనేందుకు రాష్ట్రపతి నుంచి ఆహ్వానం అందింది. సబ్బారావు పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా ప్రొద్దుతిరుగుడు, మొక్కజొన్న, అరటి సాగులో రైతులకు మెలకులను అందిస్తున్నారు. ప్రభుత్వం పరిశోధన సంస్థలు అందించిన అనేక వరి వంగడాలను ప్రయోగాత్మకంగా సాగు చేస్తూ అనేక పురస్కారాలను పొందారు. ఈ మేరకు రాష్ట్రపతి కార్యాలయం నుంచి వచ్చిన ఆహ్వాన పత్రికను అధికారులు ఆయనకు అందించారు.

======================